## క్లుప్తంగా

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



గుడిమూలలో ఆకాష్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

**సఖినేటిపల్లి:** మండలంలోని గుడిమూలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి నల్లి ఆకాష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సోమవారం బాలుడి ఇంటి వద్ద అందజేశారు. ఇటీవల పదకొండు సంవత్సరాల వయస్సున్న ఆకాష్‌కు చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయించారు. ఆకాష్ తల్లి రమాబాయి వలంటీర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి రాజేంద్ర వ్యవసాయం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే చొరవ తీసుకుని, సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం స్పందించి ఆకాష్‌కు రూ.5 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ-2 రుద్రరాజు చిన రాజా, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు కోన ప్రభాకర్‌రావు, నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, పసలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు**

**రాజోలు:** గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం వేగివారిపాలెంలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. సర్పంచ్ పప్పొప్పుల వెంకట లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తి స్థాయిలో పనులు చేపట్టారన్నారు. కొన్ని గ్రామాల్లో నిర్మాణానికి నోచుకోని బీటీ, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజామణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఏస్తేరు రాణి, చెన్నడం సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అడబాల నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీల్లో విజేతలకు సన్మానం



సన్మానం అందుకున్న లూటుకుర్రు విద్యార్థులు

**మామిడికుదురు:** జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన లూటుకుర్రు గ్రామానికి చెందిన విద్యార్థులను సోమవారం సన్మానించారు. నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు విద్యార్థులకు ఆరెంజ్, బ్లూ బెల్ట్‌లను అందజేశారు. వారికి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ తాతకాపు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ చిన్నారులు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, గ్రాండ్ మాస్టర్ కె.శివకోటి, కోచ్ ఎం.శ్రీనివాస్, వార్డు సభ్యుడు బోనం అబ్బులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన అర్చకులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ విజయ సారథి, భక్తులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరుని కల్యాణం

**అంబాజీపేట:** స్థానిక పెద్ద వీధిలో వేంచేసిన వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి వేంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన పెసల శ్రీనివాసరెడ్డి దంపతులతో వార్షిక కల్యాణాన్ని ఆలయ అర్చకులు యలమంచలి సుబ్రహ్మణ్యం, సోమేష్ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్.మూర్తి, గన్నవరపు సూరిబాబు, గంటి శ్రీరామమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రేపటితో ఉత్సవాల ముగింపు

**మలికిపురం:** మండలంలోని గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మ వారి తీర్థం ఈ నెల 19వ తేదీ బుధవారంతో ముగుస్తాయని ఆలయ చైర్మన్ సుందర నాగేశ్వరరావు, ఈఓ నాగవిష్ణు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద వారు మాట్లాడుతూ గత నెల రోజులుగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. కాగా ఉత్సవాల నేపథ్యంలో సోమవారం భారీగా అన్న సమారాధన జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. బుధవారం వరకూ ఏకధాటిగా అన్న సమారాధన ఉంటుందని కమిటీ తెలిపింది.

# వరి వడిగా కోతలు

- విరివిగా కోతయంత్రాల వినియోగం
- ఆశాజనకంగా దిగుబడి
- శ్రీధృతి, బొండాలు రకాలే సాగు



మొగలికుదురులో యంత్రం సహాయంతో కోస్తున్న దాళ్వా కోతలు

**మామిడికుదురు/ఆలమూరు:** రబీ సీజన్‌లో భాగంగా రైతులు సాగు చేసి దాళ్వా పంట పక్వానికి చేరడంతో రైతులు కోతల్లో బిజీ అయ్యారు. వాతావరణం సానుకూలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కోతలు జోరందుకున్నాయి. ఇంత వరకు 10 శాతం కోతలు పూర్తయ్యాయి. పి.గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో 13,200 ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా పంట సాగు చేశారు. ఎకరానికి 40 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఆలమూరు ఏవో లక్ష్మీలావణ్య తెలిపారు. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల్లోని 12 మండలంలో రబీ సీజన్‌లో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో అత్యధికంగా అంతర్రాష్ట్ర మార్కెట్ కలిగిన 60 శాతం మంది ఎంటీయూ (1121) శ్రీధృతి, 40 శాతం మంది సన్నాలు రకమైన ఎంటీయూ (3626) బొండాలు రకం రైతులు సాగు చేశారు. తొలుతగా వరినాట్లు వేసిన పంట పక్వానికి రావడంతో సంబంధిత రైతులు ముందుగా వరి కోతలు ప్రారంభించారు.

**అందుబాటులో వరి కోత యంత్రాలు**

రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అన్ని మండలాల్లో వరి కోత యంత్రాలను రైతులకు పంపిణీ చేయడంతో విరివిగా వరి కోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రబీ సీజన్‌లో వరి కోత యంత్రాలపై ఆధారపడ్డ సుమారు 90 శాతం మంది రైతులకు వరి కోత ధరల విషయంలో కొంత ఊరట లభించనుంది. పుంత రోడ్లు లోపల ఉన్న వరి చేలల్లో కూలీలతోను, రహదారులు, పుంత గట్లు పక్కన ఉన్న చేలల్లోని మరికొంతమంది రైతులు యంత్రాలతోను వరికోతలు చేపట్టారు. పశుగ్రాసం కోసం కొంతమంది రైతులు కూలీలను వినియోగించడం భారంగా మారింది. ప్రస్తుతం రోజు కూలి ధర రూ.900 వరకూ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాన్ని ఎన్‌ఆర్‌జీఈఎస్‌కు అనుసంధానం చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

**పంట బాగా పండింది**



ఎనిమిది ఎకరాల్లో దాళ్వా సాగు చేశాను. పంట కోత దశకు రావడంతో కోతలు మొదలు పెట్టాం. శ్రీధృతి రకం సాగు చేశాను. దాళ్వా సాగు ఆశాజనకంగా సాగింది. ఏవిధమైన సమస్యలు లేవు.ఈ సంవత్సరం పంట బాగా పండింది.

– తాడి రామకృష్ణ, రైతు, నగరం

**రెండెకరాల్లో సాగు చేశా**



రెండెకరాల విస్తీర్ణంలో దాళ్వా సాగు చేశా. ఎంటీయూ–1156 రకం పండించా. నారుమడి ఆలస్యమైంది. దీంతో పది రోజులు ముందుగా కోతకు వస్తుందని ఆశించి 1156 రకం పండించా. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. ఎకరానికి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా.

– నైనాల బాల సంజీవ్, రైతు, మామిడికుదురు

**దిగుబడి ఆశాజనకంగా ఉంది**



రబీలో పంట దిగుబడి ఆశాజనంగా ఉంది. తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉండటంతో రైతులకు పెట్టుబడి ఆదా అయింది. ఇటీవల నిర్వహించిన పంట కోత ప్రయోగంలో పలుచోట్ల ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దాటి దిగుబడి వచ్చినట్లు నిర్ధారణ అయింది.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

**అందుబాటులో కోత యంత్రాలు**



వరి కోత యంత్రాలు విరివిగా అందుబాటులోకి రావడంతో కోత ధర కూడా రైతులకు వీలుగా ఉంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే దిగుబడి ఆశాజనకంగా ఉండే పరిస్థితి కనబడుతుంది. రైతులంతా సంతోషంగా ఉన్నారు.

– శింగంశెట్టి దుర్గయ్య, కౌలు రైతు, పెనికేరు

### భూసార పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలి

**అంబాజీపేట:** వ్యవసాయ సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు భూసార పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు అన్నారు. మాచవరం ఆర్బీకేలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన మట్టి నమూనా సేకరణపై వీఏఏలు, వీహెచ్‌ఏలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్ష కార్డు ఉపయోగాలు, కార్డును బట్టి ఎరువులు వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. భూసారాన్ని బట్టి ఎరువులు వాడుకోవడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. ఐదెకరాలకు ఒక నమూనా మట్టిని సేకరించాలన్నారు. మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా భూమిలో పోషకాలు లభ్యత, వేయవలసిన ఎరువుల మోతాదు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

### తక్షణమే చెత్త తొలగించండి

**అంబాజీపేట:** మేజర్ పంచాయతీ అయిన మాచవరంలో ఎటు చూసిన చెత్త పేరుకుపోయిందని దీని వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా తక్షణమే తొలగించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, గ్రామస్తులు కోరారు. అమలాపురంలో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నెల రోజుల నుంచి గ్రామంలో ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయిందని, సేకరించిన చెత్తను డంపింగ్ చేసే ప్రాంతంలో అక్కడ నివాసితులు అడ్డుకోవడంతో పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందనలో మాచవరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోనసీమ వినియోగదారుల ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి వినతి పత్రాన్ని ఎంపీడీఓ ఐ.రత్నం రాజు, ఈఓపీఆర్డీ బి.మమతలకు అందజేశారు.

### అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

**అంబాజీపేట:** విధులపై అంకిత భావంతో పనిచేసే ప్రతి ఉద్యోగికి ప్రజల గుర్తింపు ఉంటుందని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో డిజిటల్ ప్రధానోధ్యాయుడిగా విధులు నిర్వహించి పదోన్నతిపై వెళుతున్న బొరుసు వీరవెంకట సుబ్రహ్మణ్యంకు హెచ్‌ఎం ఎంఎస్ఎస్ కుమారి అధ్యక్షతన సన్మాన సభను సోమవారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై వెళుతున్న సుబ్రహ్మణ్యంను గ్రామస్తులు, పీఎంసీ సభ్యులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పీఎంసీ చైర్మన్ మట్టపర్తి సూర్యనారాయణ, రాయుడు షణ్ముఖ్, రాయుడు కృష్ణమహేష్, జి.ప్రవీణ్‌కుమార్, మోకా ప్రకాష్, ముషిణి సత్యనారాయణ పాల్గొన్నారు.

# చెరువు అభివృద్ధికి శ్రీకారం



బిళ్లకుర్రులో చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

**కొత్తపేట:** అమృత సరోవరం పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల అభివృద్ధితో ఉపాధి కూలీలందరికీ ఎక్కువ రోజులు పని కల్పించడంతో పాటు సుందరీకరణతో గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని బిళ్లకుర్రులో 2.65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లింగమ్మ చెరువును రూ.15.20 లక్షలతో 4,909 పనిదినాలతో సుందరీకరణకు ప్రతిపాదించారు. ఆ చెరువు అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీపీ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా గ్రామీణ చెరువులను అమృత సరోవరం పేరుతో పూడికతీసి, గట్టును పటిష్టపరచి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, ఇరువైపులా మొక్కలు నాటి, బెంచీలు ఏర్పాటు చేసి సుందరీకరిస్తారన్నారు. జిల్లాలోనే బిళ్లకుర్రు ఈ పథక వినియోగంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం సత్తెమ్మ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, పంచాయతీ నిధులు సుమారు రూ.7 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్లకు, తరెట్లవారిపేట అంబేడ్కర్ కాలనీలో రూ.2 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం ఆధునీకరణ పనులకు ఎంపీపీ గంగాధరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు బొక్కా నాగరాణి, చిత్రపు ఆనంద్‌బాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు, ఉప సర్పంచ్ కుడుపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మంగిపూడి రాంబాబు, అమృత సరోవరం జిల్లా కోఆర్డినేటర్ ఎం.త్రినాథ్, ఉపాధి ఏపీఓ ఎ.ఆనంద్‌కుమార్, ఎఫ్ఏలు కుసుమే శేషారావు, రాయుడు మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ఇతోధికంగా పాటు పడాలి



గంగలకుర్రు సొసైటీలో చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

**అంబాజీపేట:** సహకార సంఘాల చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రైతుల సంక్షేమానికి ఇతోధికంగా పాటు పడాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ పేరి శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన మట్టపర్తి చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈఓ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు పితాని సత్తిబాబు, బొక్కా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తమకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చిట్టిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు, పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, దొమ్మేటి సత్యమోహన్, విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 21 రోజుల్లో నగదు జమ

**మలికిపురం:** రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతులు అకౌంట్‌లో నగదు జమ అవుతుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ పేర్కొన్నారు. రామరాజులంకలో జరుగుతున్న వరి మాసూళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఆర్బీకేల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. రైతులకు పూర్తి అందుబాటులో ఉండే విధంగా ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

# ప్రజా సంక్షేమమే పరమావధిగా..

- గుమ్మిలేరు, మాచవరం, వేగివారిపాలెంలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, వరప్రసాదరావు



వేగివారిపాలెంలో మహిళకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



గుమ్మిలేరులో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**ఆలమూరు:** ప్రజా సంక్షేమమే పరమావధిగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరిస్తూ మండలంలోని గుమ్మిలేరులో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం రెండో విడత నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్ చౌదరి ఆధ్వర్యాన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల మేరకు ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల తమకు కలిగిన లబ్ధిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి గణాంకాలతో సహా వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ కార్యదీక్షతో ముందుకు సాగారు. అర్హులైన లబ్ధిదారులకు నవరత్నాల వల్ల రికార్డు స్థాయిలో రూ.8.94 కోట్లు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

**అర్హులైన వారందరికీ త్వరలో ఇళ్లు**

రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మెయిన్‌రోడ్డుకు సమీపాన సేకరించి అభివృద్ధి చేసిన 29.75 ఎకరాల్లో మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన 1391 మందికి త్వరలోనే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మండపేట పట్టణానికి చేరువలో గొప్ప గ్రామాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, సర్పంచ్‌లు పెంటపాటి శ్యామల, దంగేటి చంద్రకళ, కట్టా శ్రీనివాసు పాల్గొన్నారు.

**పార్టీలకతీతంగా సంక్షేమం**

**అంబాజీపేట:** అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం-4 పరిధిలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. స్థానికల నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ మట్టా పార్వతి, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను, కుసుమ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఇంటి ముంగిట సంక్షేమం: ఎమ్మెల్యే రాపాక**

**రాజోలు:** రాష్ట్రంలోని ప్రతి ఇంటి ముంగిట సంక్షేమ పథకాలు విరాజిల్లుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం వేగివారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాపాకను సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, సత్యసాయిరామ్ దంపతులు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ బడుగు సునీత, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, యెలుమర్తి వెంకటేష్, బళ్ల లక్ష్మణరావు, శీలం త్రిమూర్తులు, అప్పారి గోపి తదితరులు పాల్గొన్నారు.

### ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తాం

**మామిడికుదురు:** ప్రస్తుత వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని పాశర్లపూడిలంక గ్రామసభలో తీర్మానించారు. స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. 2023-4 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులపై ప్రణాళిక రూపొందించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలతో పాటు వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తీర్మానించారు. వీటిని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఆశ కార్యకర్తల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించారు. సర్పంచ్ చేతుల మీదుగా పలువురికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామసభలో ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**మామిడికుదురు:** మండలంలో జటిలంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నేతలు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్యకు తాగునీటి సమస్యపై వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని 18 గ్రామాల్లో శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని వాపోయారు. గతంలో వేసవిలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించే వారని గుర్తు చేశారు. ఈ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. మండలంలో పండించిన ధాన్యాన్ని మండలంలో మిల్లర్లే కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈదరాడ గ్రామ రైతులు స్పందనలో వినతిపత్రం ఇచ్చారు. ఇతర మండలాలకు చెందిన ధాన్యం ఇక్కడ కొనడం వల్ల మండల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై స్పందించి మండల రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం ఇచ్చారు.

### అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

**కొత్తపేట:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం అగ్నిప్రమాదాలు-నివారణ చర్యలపై విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మండలంలో పలు ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాల్లో బాలలకు బహుళ అంతస్తుల్లో అగ్నిప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, అప్పుడు ప్రజలను రక్షించి ఎలా బయటకు తీసుకురావాలి. ఆ మంటలను ఎలా అదుపు చేయాలి అనే అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం అగ్నిమాపక శకటంతో గ్రామ పురవీధుల్లో తిరిగి 'అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలు' పేరుతో ముద్రించిన కరపత్రాలు పంచుతూ, మైక్ ద్వారా అగ్ని ప్రమాద నివారణ పద్ధతుల గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

**మామిడికుదురు:** మండలంలోని 15 గ్రామాల్లో ఈ నెల మంగళవారం నుంచి 27వ తేదీ వరకు ఆధార్ మొబైల్ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం కరవాక, ఈదరాడ, ఆదుర్రు గ్రామాల్లోను, 19వ తేదీన కరవాక, గోగన్నమఠం, ఆదుర్రు గ్రామాల్లోను, 20వ తేదీన లూటుకుర్రు, పాశర్లపూడిలంక, మామిడికుదురు-1 సచివాలయాల్లోను మొబైల్ ఆధార్ శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. 26వ తేదీన మొగలికుదురు, మగటపల్లి, మాకనపాలెం, 27వ తేదీన బి.దొడ్డవరం, గెద్దాడ, పెదపట్నం గ్రామాల్లో ఆధార్ శిబిరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ఈ క్యాంపులు అందుబాటులో ఉంటాయని, వీటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సూచించారు.

### పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

**ఆలమూరు:** మండలంలోని బడుగువానిలంకలో రెండున్నర దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను సమస్యను పరిష్కరించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆలమూరు దర్నా నిర్వహించింది. ఉమ్మడి జిల్లా ఏఐకెఎంఎస్ అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నాలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### మత్స్యకార భరోసా అమలు కోరుతూ నిరసన

**మామిడికుదురు:** వైఎస్సార్ మత్స్యకార భరోసా వర్తింప చేయాలని కోరుతూ పాశర్లపూడిబాడవ మత్స్యకారులు సోమవారం శ్రీరామ్‌పేటలో నిరసన తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే రూ.10 వేల ఆర్థికసాయం తమకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 53 బోట్లు ఉండగా వాటిలో 14 బోట్లకు చెందిన 84 మందిని జాబితా నుంచి తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. 2021లో తమకు సహాయం అందించారని, 2022లో ఇస్తామని చెప్పినా ఇవ్వలేదని, ఈ ఏడాదీ సహాయం అందించడం లేదన్నారు. దీనిపై పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలన్నారు. ఇసుక బోట్లు కావడం వల్ల 14 బోట్లకు చెందిన మత్స్యకారులకు సహాయం అందించడం లేదని మత్స్యశాఖ అధికారులు చెప్పారు. గోగన్నమఠం గ్రామానికి చెందిన 54 మంది గంగపుత్రులు కూడా తమకు సహాయం అందించడం లేదంటూ వాపోయారు. ఈ ఆందోళనలో మల్లాడి విష్ణు, శేరు పారారావు తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**ఆలమూరు:** మండలంలోని మడికిలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు జరిగింది. గ్రామానికి చెందిన పెండ్యాల కుటుంబీకులు స్థానిక సినిమా థియేటర్ వద్ద నెలకొల్పిన ఈ చలివేంద్రాన్ని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ప్రారంభించారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.